క్లుప్తంగా

ప్రసన్నాంజనేయ స్వామికి విశేష పూజలు

కంచికచర్ల: మండలంలోని పరిటాల నేషనల్ హైవే పక్కన ఉన్న ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో భక్తులు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు స్వామి వారికి అష్టోత్తర, మహన్యాసపూర్వక పూజలు చేశారు. హనుమాన్ చాలీసా పఠనం చేశారు.

మాజీ ప్రధాని ఇందిరకు ఘన నివాళి

నందిగామ: మాజీ ప్రధాని ఇందిరా గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని మంగళవారం నందిగామ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఇందిరమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జాషువా ఫౌండేషన్ అధ్యక్షుడు కోట రవీంద్రనాథ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కామా శ్రీను, షేక్ ఆరిఫ్, రత్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపురంలో జాతీయ సమైక్యతా ర్యాలీ



పెద్దాపురం(వీరులపాడు): దేశ సమైక్యత, సమగ్రతను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎంపీపీ కోటేరు లక్ష్మి అన్నారు. మండలంలోని పెద్దాపురం గ్రామంలో జాతీయ సమైక్యతా దినోత్సవం సందర్భంగా ఎయిడెడ్ హిందూ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి గ్రామంలో ఆదివారం ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎందరో మహనీయుల ప్రాణత్యాగంతోనే భారతావనికి స్వాతంత్ర్యం సిద్ధించిందని చెప్పారు. కార్యక్రమంలో షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, సర్పంచ్ నిప్పులపల్లి శాంతమ్మ, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య పాల్గొన్నారు.

రేపు వత్సవాయి మండల పరిషత్ సమావేశం

వత్సవాయి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నవంబర్ 2 న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎస్వీ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పది గంటలకు ఎంపీపీ కొలుసు రమాదేవి అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు. మండల స్థాయి అధికారులందరూ సమగ్ర సమాచారంతో సమావేశానికి హాజరుకావాలని కోరారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు వత్సవాయి జెడ్పీ విద్యార్థి



వత్సవాయి: రాష్ట్రస్థాయి పోటీలకు వత్సవాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎం. నందగోపాలకృష్ణ ఎంపికైనట్లు హెచ్ఎం ఆర్.అశోక్‌కుమార్ తెలిపారు. గుడివాడలోని పొట్టి శ్రీరాములు మున్సిపల్ హైస్కూల్‌లో సోమవారం జరిగిన అండర్ 17 విభాగంలో కబడ్డీలో ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు నందగోపాలకృష్ణను అభినందించారు. కార్యక్రమంలో పీడీ మార్కపూడి బాబూరావు, ఉపాధ్యాయుడు కాకాని శ్రీను తదితరులు అభినందించారు.

అల్లూరు జెడ్పీ విద్యార్థిని...

అల్లూరు(వీరులపాడు): మండలంలోని అల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న వెంకట సత్యవేణి అండర్-17 విభాగంలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పీడీ సింగిరాజు తెలిపారు. గుడివాడలో సోమవారం నిర్వహించిన కబడ్డీ జట్ల ఎంపికలో ఉమ్మడి కృష్ణాజిల్లా తరపున అండర్-17 విభాగంలో సత్యవేణి ఎంపికైనట్లు చెప్పారు. ఈ సందర్భంగా సత్యవేణిని పలువురు గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకట నారాయణ, ఎస్ఎంసీ చైర్మన్ నాగబాబు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హౌసింగ్ లబ్ధిదారులకు బ్యాంకు రుణాలు

తిరువూరు: జగనన్న కాలనీలలో పక్కా గృహాలు నిర్మించుకునే లబ్ధిదారులకు బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం కల్పిస్తున్నట్లు తిరువూరు నగర పంచాయతీ కమిషనర్ బాలకృష్ణ తెలిపారు. నగరపంచాయతీ కార్యాలయంలో మంగళవారం లబ్ధిదారులకు నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. పీటీకొత్తూరులోని జగనన్న కాలనీలలో ఇళ్ల స్థలాలు పొందిన లబ్ధిదారులు వెంటనే పక్కా గృహాల నిర్మాణం చేపట్టాలన్నారు. కాల నీలలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని, నీరు, విద్యుత్, రహదారి సదుపాయాలు కల్పించామన్నారు. లబ్ధిదారులకు రూ.2లక్షల వర కు బ్యాంకు ద్వారా రుణ సదుపాయం కల్పించేందుకు బ్యాంకర్లతో మెప్మా అధికారులు సమన్వయం చేస్తున్నట్లు తెలిపారు. ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారు లకు కావాల్సిన సిమెంటు, ఇసుక, ఇనుము సరఫ రా చేస్తున్నామన్నారు. నూరు శాతం ఇళ్ల నిర్మాణం పూర్తి చేయడం లక్ష్యంగా ఇంజినీరింగ్ సిబ్బంది కృషి చేయాలన్నారు. హౌసింగ్, బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

పనిచేయని అధికారులను సరెండర్ చేయండి

- పైపులైన్ల లీకులను అరికట్టి తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిద్దాం
- కౌన్సిల్ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, హాజరైన కౌన్సిలర్లు

జగ్గయ్యపేటఅర్బన్: పనిచేయని అధికారులను సరెండర్ చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ రంగాపురం రాఘవేంద్ర మున్సిపల్ కమిషనర్ నాగమల్లేశ్వరరావును కోరారు. మున్సిపల్ కౌన్సిల్ మీటింగ్ హాల్‌లో మంగళవారం చైర్మన్ రాఘవేంద్ర అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. ముందుగా కౌన్సిల్ సీసీ తాజుద్దీన్ అజెండాలోని అంశాలను కౌన్సిల్ సభ్యులకు చదివి వినిపించారు. తొలుత సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, కౌన్సిలర్లు పందుల రోశయ్య, వట్టెం మనోహర్, కన్నెబోయిన రామలక్ష్మి పట్టణంలో మంచినీటి పైపుల్లో మురుగునీరు వస్తోందని, పైపులు శిథిలావస్థకు చేరుకున్నాయని, మున్సిపల్ ఇంజినీరింగ్ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పైపులైన్లకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయించాలని కోరారు. దీనిపై చైర్మన్ రాఘవేంద్ర మాట్లాడుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ సిబ్బందిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పనితీరు మార్చుకోని ఉద్యోగులు, సిబ్బంది తమకు అవసరం లేదని, పనిచేయని అధికారులు, సిబ్బందిపై డీఎంఏ, కలెక్టర్ తదితర ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని కమిషనర్‌కు సూచించారు. ప్రధాన పైపులైన్లు వద్ద, ట్యాంకుల వద్ద, హెడ్ వాటర్ వర్క్స్ వద్ద పైపులైన్ల లీకులన్నింటిని గుర్తించి యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేసి వార్డుల్లో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలన్నారు.

ప్రజా సంక్షేమాన్ని విస్మరించం

24 వ అంశానికి సంబంధించి రామ్‌కో సిమెంట్స్‌కు 11.32 సెంట్ల స్థలం కేటాయింపు ప్రతిపాదనపై పాలక, ప్రతిపక్ష సభ్యుల మధ్య తీవ్ర వాదోపవాదాలు జరిగాయి. ప్రతిపక్ష కౌన్సిలర్లు కన్నెబోయిన రామలక్ష్మి, పేరం సైదేశ్వరరావు, నకిరిగంటి వెంకట్ తదితరులు మాట్లాడుతూ పట్టణం సమీపంలో ప్లాంట్ ఏర్పాటుచేస్తే కాలుష్యం సమస్య ఇంకా పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై చైర్మన్ రాఘవేంద్ర మాట్లాడుతూ పట్టణ ప్రజల సంక్షేమాన్ని విస్మరిస్తూ ఎటువంటి నిర్ణయం తీసుకోవడం జరగదన్నారు. కౌన్సిలర్ సామినేని వెంకటకృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ రామ్‌కో వారు సీఎస్ఆర్ నిధులను కేటాయిస్తూ పట్టణాభివృద్ధిలో భాగస్వాములవుతుండటం అభినందనీయమని, అదే సమయంలో ప్రజల అభిప్రాయాన్ని గౌరవిస్తామన్నారు. కౌన్సిలర్ కొలగాని రాము మాట్లాడుతూ ప్రజలు వ్యతిరేకిస్తే ఆ స్థలాన్ని డంపింగ్ యార్డుకు ప్రపోజల్ పెట్టాలని తెలిపారు. సమావేశంలో కౌన్సిలర్లు గింజుపల్లి వెంకట్రావు, సుందరమ్మ, సూర్యదేవర విజయలక్ష్మి, కంచేటి గీతా రాణి, కర్ల శాంతకుమారి, అలేఖ్య తదితరులు పలు సమస్యలను ప్రస్తావించారు. అనంతరం అజెండాలోని 72 అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. కమిషనర్ నాగమల్లేశ్వరరావు, తహసీల్దార్ సూర్యారావు, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

స్టాండింగ్ కౌన్సిల్‌గా లక్ష్మీనారాయణ మరో మూడేళ్లు పొడిగింపు

జగ్గయ్యపేట మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా ఉన్న న్యాయవాది గుంటక లక్ష్మీనారాయణ పదవీకాలాన్ని మరొక మూడేళ్ల పాటు పొడిగించారు. ఈ మేరకు మంగళవారం జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో తీర్మానాన్ని కౌన్సిల్ ఆమోదించింది.

ఉప ముఖ్యమంత్రికి ఘన స్వాగతం

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలో రూ.2.32 కోట్లతో నిర్మించిన గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల భవనం, డైనింగ్ హాల్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖ మంత్రి పీడిక రాజన్నదొరకు మంగళవారం పట్టణంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్థానిక చిల్లకల్లు రోడ్డులోని వైఎస్సార్ సర్కిల్ వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహం నుంచి ప్రధాన వీధుల గుండా గురుకుల పాఠశాల వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ముందుగా చిల్లకల్లు రోడ్‌లోని వైఎస్ సర్కిల్ వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి మంత్రి రాజన్నదొర, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువ నాయకుడు సామినేని వెంకట కృష్ణప్రసాద్, పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, రాష్ట్ర నాయకుడు వేల్పుల రవికుమార్, మైనింగ్, పూసల కార్పొరేషన్ల డైరెక్టర్లు బత్తుల రామారావు, చేనికు మారి, సచివాలయాల కన్వీనర్లు తుమ్మేపల్లి నరేంద్ర, కన్నమాల శామ్యూల్, వక్ఫ్‌బోర్డు జిల్లా కార్యదర్శి జుబేర్, వైఎస్సార్ సీపీ పట్టణ ఎస్టీసెల్, మహిళ విభాగం అధ్యక్షులు బద్దూనాయక్, మునిని రాజ్యలక్ష్మి, పలువురు కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.



మంత్రి రాజన్నదొరకు స్వాగతం పలుకుతూ నిర్వహించిన బైక్ ర్యాలీలో పాల్గొన్న పార్టీ శ్రేణులు

సమస్యలకు సత్వర పరిష్కారం

- సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే జగన్‌మోహనరావు
- ఉపాధి నిధులతో సీసీ రోడ్ల నిర్మాణం

వీరులపాడు: గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం దృష్టికి వచ్చిన ప్రతి ఒక్క సమస్యను సత్వరమే పరిష్కరించేలా కృషి చేస్తున్నామని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు తెలిపారు. మండలంలోని పెద్దాపురం, జయంతి, దొడ్డదేవరపాడు గ్రామాలలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారంపై ఆయా గ్రామ సచివాలయాల వద్ద అధికారులు, ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులతో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కో సచివాలయానికి రూ.20 లక్షల నిధులు మంజూరు చేశారన్నారు. ఈ నిధుల ద్వారా ప్రజలు తెలిపిన సమస్యలను ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తామని తెలిపారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు గ్రామాలలో జరుగుతున్న పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. మిగిలిన సమస్యలను కూడా త్వరలోనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన

గ్రామాలలోని ప్రతి ఒక్క అంతర్గత రహదారిని సిమెంట్ రోడ్డుగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే జగన్‌మోహనరావు చెప్పారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.40 లక్షలతో మండలంలోని జయంతి, దొడ్డదేవరపాడు గ్రామాల్లో చేపడుతున్న సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో గ్రామీణ ప్రాంత ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక వసతులను కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, తహసీల్దార్ ఆశయ్య నాయక్, ఎంపీడీవో అరుంధతీ దేవి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తిసౌజన్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, సర్పంచ్‌లు నిప్పులపల్లి శాంతమ్మ, మారపాక మహాలక్ష్మి, చండ్యాల రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యులు తోట నారాయణరావు, ఇప్పల సత్యనారాయణ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్‌లు జంగా కోటిరెడ్డి, ఆవుల ప్రసాద్, పలువురు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో మౌలిక సౌకర్యాల కల్పన

ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు

మోగులూరు(కంచికచర్ల): వైఎస్సార్ జగనన్న కాలనీలలో అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పిస్తున్నామని, లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేయాలని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని మోగులూరు జగనన్న కాలనీలో ఫేజ్-2 కింద విద్యుద్దీకరణ పనులు చేపట్టేందుకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న కాలనీలో విద్యుత్ లైన్లు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం రూ.71లక్షలు మంజూరు చేసిందన్నారు. ఆ నిధులతో కాలనీలో విద్యుత్ శాఖ అధికారులు అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ షేక్ మలక్‌బషీర్, జెడ్పీటీసీ సభ్యురాలు వేల్పుల ప్రశాంతి, వైస్ ఎంపీపీ బండి మల్లికార్జునరావు, సర్పంచి షేక్ మొయిద్దీన్‌బీ, ఎంపీటీసీ సభ్యురాలు ఆవల సామ్రాజ్యం, మాజీ సర్పంచి షేక్ హుస్సేన్, వైఎస్సార్‌సీపీ నాయకులు రాయల నరసింహారావు, వెలగా శంకరరావు, వెలగలేటి బాబు, ప్రత్తిపాటి కృష్ణారావు, విద్యుత్ శాఖ ఏఈ కృష్ణారావు పాల్గొన్నారు.

ఘనంగా వల్లభాయ్ పటేల్ జయంతి

పెనుగంచిప్రోలు: స్థానిక కేవీఆర్ జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం స్వాతంత్ర్య సమరయోధుడు, భారత మాజీ ఉపప్రధాని వల్లభాయ్ పటేల్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం కె.జలజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వత్సవాయిలో...

వత్సవాయి: మాజీ ఉప ప్రధాని వల్లభాయ్‌పటేల్ జయంతి మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఎంపీపీ కొలుసు రమాదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు యేశపోగు దేవమణి పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎంపీపీ, జెడ్పీటీసీ తదితరులు వల్లభాయ్ పటేల్ చిత్రపటం వద్ద జాతీయ సమైక్యతా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు రంగిశెట్టి ముత్తయ్య, ఎంఈవో ఎల్.నాగరాజు, మండల పరిషత్ ఏవో బి.రాజు, భూక్యా రాజానాయక్ తదితరులు పాల్గొన్నారు.



వత్సవాయిలో వల్లభాయ్‌పటేల్ చిత్రపటం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ తదితరులు

జిల్లా సైన్స్ అధికారి మైనం హుస్సేన్‌కు సత్కారం



పాయకాపురం(విజయవాడరూరల్): పుచ్చలపల్లి సుందరయ్య మున్సిపల్ హైస్కూల్ భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు, జిల్లా సైన్స్ అధికారి మైనం హుస్సేన్‌కు డాక్టరేట్ వచ్చిన సందర్భంగా పుచ్చలపల్లి సుందరయ్య మున్సిపల్ హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయనను మంగళవారం ఘనంగా సత్కరించారు. జిల్లా సైన్స్ అధికారిగా, ఒక ఉపాధ్యాయుడుగా హుస్సేన్ అనేక సైన్స్ కార్యక్రమాల్లో చేసిన కృషి అందరికీ ఆదర్శవంతమని పలువురు ఉపాధ్యాయులు కొనియాడారు. ఇటీవల పుదుచ్చేరిలో గ్లోబల్ పీస్ హ్యూమన్ యూనివర్సిటీ సైన్స్ గౌరవ డాక్టరేట్‌ను అందజేయడం ఉపాధ్యాయులకు సంతోషాన్ని కల్గించిందని పేర్కొన్నారు. హుస్సేన్ మాట్లాడుతూ కృషి పట్టుదల వుంటే గుర్తింపు లభిస్తుందని, సన్మానించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు జాని సునంద్, వినోదరావు, సత్యవతి, రేణుక, శ్రీనివాసరావు, గణేష్ మాస్టార్ తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయంగా అట్లతద్దె వేడుకలు

రావిరాల(జగ్గయ్యపేట): ఆశ్వయుజ మాసం బహుళ తదియ సందర్భంగా గ్రామంలో అట్లతద్దె మహోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా అర్చకస్వామి మార్తి రామకృష్ణ శాస్త్రి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని సౌభాగ్య ప్రసాద మహాగణపతి, మహాగౌరి అష్టోత్తర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అట్ల నైవేద్యములు చేసి వాయినాలు అందజేశారు.

అలరించిన సినీ సంగీత విభావరి

విజయవాడ కల్చరల్: తెలుగు కళావాహిని, శ్రీ కళాభారతి, జీఆర్‌కే సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో గాంధీనగర్ కొత్తా పూర్ణానందం కళావేదికలో అమర గాయకుల స్ఫూర్తి సభ, సినీ స్వరాంజలి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు మాట్లాడుతూ ఘంటసాల, బాలసుబ్రహ్మణ్యం, మాధవపెద్ది సత్యం, పిఠాపురం నాగేశ్వరరావు లాంటి గా యకులు తెలుగు సినిమా పాటకు జాతీయ స్థాయి గుర్తింపు తీసుకువచ్చినట్లు తెలిపారు. సినీ సంగీత విభావరిలో దుర్గానాగమణి, మల్లాది స్వాతి, వడ్డాది కామేశ్వరి, షబానా, శ్రావణిలు మెలోడీ గీతాలను మధురంగా ఆలపించారు.

కేబీఎన్‌లో డిగ్రీ నాలుగో ఏడాదికి దరఖాస్తుల ఆహ్వానం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నగరంలోని కాకరపర్తి భావనారాయణ కళాశాల డిగ్రీ నాలుగో ఏడాదికి విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీ నారాయణరావు తెలిపారు. నూతన విద్యా విధానంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టి నాలుగో సంవత్సరం డిగ్రీ కోర్సుకు సంబంధించి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. బీఎస్సీ(కెమిస్ట్రీ), బీఎస్సీ(కంప్యూటర్ సైన్స్), బీఎస్సీ (స్టాటిస్టిక్స్), బీఎస్సీ(ఎలక్ట్రానిక్స్), బీఎస్సీ(డేటా సైన్స్), బీకాం (కంప్యూటర్ అప్లికేషన్స్, బీకాం(బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్), బీకాం(హెచ్ఆర్ అండ్ మార్కెటింగ్) కోర్సులకు సంబంధించి నాలుగో ఏడాది కోర్సుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. సంబంధిత కోర్సులో మూడు సంవత్సరాల డిగ్రీ పూర్తి చేసుకొని, అన్ని సబ్జెక్టులు ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ కోర్సులకు అర్హులని పేర్కొన్నారు. అదేవిధంగా కోర్సులో చేరే అర్హులైన విద్యార్థులకు సాధారణ డిగ్రీ విద్యార్థులకు అందే ప్రభుత్వ పథకాలు అందుతాయన్నారు. నాలుగో సంవత్సరం డిగ్రీ పూర్తి చేసిన వారికి పీజీ ఒక సంవత్సరంలో పూర్తి చేసుకునే అవకాశముంటుందని తెలిపారు. మరింత సమాచారం కోసం కళాశాల కార్యాలయంలో గానీ, ఫోన్ నెంబర్ 91829 07747లో సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు.

సర్వోత్తమ గ్రంథాలయంలో విద్యార్థులకు పోటీలు

పటమట(విజయవాడతూర్పు): జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా సర్వోత్తమ గ్రంథాలయం ఆధ్వర్యంలో నగరంలోని వివిధ పాఠశాలలు, కళాశాల విద్యార్థులకు నవంబర్ 2-4 తేదీల్లో చిత్రలేఖన, కథలు చెప్పటం, పుస్తక సమీక్ష, పైకి చదవటంతో పాటు సాహితీ క్విజ్ పోటీలను నిర్వహిస్తున్నట్లు సర్వోత్తమ గ్రంథాలయం కార్యదర్శి రావి శారద మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు సబ్ జూనియర్లకు(1-4 తరగతులకు) కథలకు బొమ్మలు వేయటం, కథలు చెప్పటంలో పోటీలు, జూనియర్లకు(5-7 తరగతులకు) పైకి చదవటంపై పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. 3వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు సీనియర్లు(8-10 తరగతులు)పైకి చదవటం, పుస్తక సమీక్ష, రాయటంలో పోటీలు, 4వ తేదీన మధ్యాహ్నం రెండు గంటలకు కళాశాల విద్యార్థులకు పుస్తక సమీక్ష, సాహితీ క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయా పోటీలకు నగరంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, మున్సిపల్, జిల్లా పరిషత్ పాఠశాలలు, కళాశాలల నుంచి విద్యార్థులు పాల్గొనవచ్చని క్విజ్‌లో ఒక కాలేజీ నుంచి ఒక టీమ్‌కు మాత్రమే పాల్గొనేందుకు అవకాశం ఉంటుందన్నారు. వివరాలకు 79953 13148 నంబర్‌లో సంప్రదించాలని ఆమె కోరారు.

ఆరో వార్డులో మున్సిపల్ కమిషనర్ పర్యటన

నందిగామ: పట్టణ ప్రజలకు మున్సిపాలిటీ ద్వారా అందుతున్న సేవలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు, ప్రజల వద్ద నుంచి సమస్యలను తెలుసుకునేందుకు ప్రతిరోజు వార్డు పర్యటన చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం అన్నారు. పట్టణంలోని ఆరవ వార్డులో మంగళవారం ఆయన పర్యటించారు. ఇందులో భాగంగా వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను, నూతనంగా నిర్మించిన రహదారులను పరిశీలించారు. వార్డు ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆయన వెంట వార్డు కౌన్సిలర్ షేక్ యాకూబ్ అలీ, పలువురు నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

మద్యం అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు

నందిగామ: మద్యం అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు కఠినంగా ఉంటాయని పట్టణ సీఐ హనీష్ హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్రం మధిర ప్రాంతం నుంచి నందిగామ ప్రాంతానికి ఇటీవల నిత్యం అక్రమంగా మద్యం రవాణా అవుతున్న నేపథ్యంలో మండలంలోని జొన్నలగడ్డ వద్ద దళ రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద సోమవారం రాత్రి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో 150 తెలంగాణ మద్యం సీసాలను తరలిస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకోవడంతో పాటు మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఇకనుంచి నిత్యం తనిఖీలు నిర్వహిస్తామన్నారు. కిరణ్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.సమావేశంలో ఎస్ఐ పండు దొర, సిబ్బంది పాల్గొన్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

పట్టణ అభివృద్ధే అజెండా

మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ వరలక్ష్మి

నందిగామ: పట్టణ అభివృద్ధే అజెండాగా పనిచేస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ వరలక్ష్మి అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ఉదయం 11 గంటలకు చైర్‌పర్సన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో 34 అంశాలపై చర్చించి తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలోని 20 వార్డులను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం, కౌన్సిలర్లు, ఎక్స్ అఫిషియో సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం

పోలీస్‌స్టేషన్‌లో మూడో కన్ను

- ఒక్కో స్టేషన్‌లో 10 వరకు సీసీ కెమెరాలు
- పారదర్శక సేవలకు ప్రాధాన్యం

పెనుగంచిప్రోలు: పోలీస్ వ్యవస్థ పనితీరులో పారదర్శకత, ప్రజలకు జవాబుదారీతనాన్ని పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తోంది. పోలీసులకు ప్రజలకు మధ్య సత్సంబంధాలు మెరుగుపరుస్తూ పోలీసు శాఖ ప్రతిష్టను మరింత ఇనుమడింపజేసేలా వినూత్న విధానాలకు శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా ప్రతి స్టేషన్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసింది. స్టేషన్‌లోని అన్ని విభాగాల్లో సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉండాలనే కేంద్రం, సుప్రీంకోర్టు ఆదేశాలతో ఈ విధానాన్ని పక్కాగా అమలు చేస్తోంది. ఈ మేరకు పోలీస్ టెక్నికల్ విభాగం ఆధ్వర్యంలో ప్రతి పోలీస్‌స్టేషన్‌లో 10 చొప్పున సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. జగ్గయ్యపేట సర్కిల్ పరిధిలో జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు, వత్సవాయి, చిల్లకల్లు పోలీస్‌స్టేషన్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. సిటిజన్ చార్టర్‌కు అనుగుణంగా పోలీస్ సిబ్బంది ప్రవర్తిస్తున్నారా? స్టేషన్‌లో ఎవరినైనా అక్రమంగా నిర్బంధించారా? ఏవిధంగా ప్రజలతో వ్యవహరిస్తున్నారు? అనే అంశాలపై పూర్తి స్థాయిలో పర్యవేక్షించేలా నిఘా నేత్రం పనిచేస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



పెనుగంచిప్రోలు పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల విభాగం

అన్ని విభాగాల్లో...

సీసీ కెమెరాలు పోలీస్‌స్టేషన్‌లో అన్ని విభాగాల్లో ఏర్పాటు చేశారు. స్టేషన్‌లోకి వెళ్లే ప్రధాన ప్రవేశ ద్వారం, ప్రధాన హాలు, రిసెప్షన్ రూమ్, స్టేషన్ ఆఫీసర్ గది, రైటర్ గది, కంప్యూటర్ గది, సాక్ష్యాల గది, లాకప్ గది ఇలా అన్ని విభాగాల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటు జరిగింది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఆడియో, వీడియో ఫుటేజీతో పాటు రాత్రి వేళల్లోనూ స్పష్టంగా రికార్డు చేసిన ఫుటేజీ కొన్ని నెలల పాటు స్టోరేజీ ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు.

మెరుగైన సేవలే లక్ష్యంగా...



పోలీస్ వ్యవస్థ ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించటమే లక్ష్యంగా స్టేషన్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు స్టేషన్‌లోని అన్ని విభాగాల్లో కెమెరాలు ఏర్పాటు చేశాం.

–సీహెచ్‌కే దుర్గాప్రసాద్, ఎస్ఐ, పెనుగంచిప్రోలు